క్లుప్తంగా

అన్నసమారాధన



కిర్లంపూడిలో లక్ష్మీగణపతిని దర్శించుకుంటున్న ముద్రగడ పద్మనాభం, గిరిబాబు

కిర్లంపూడి: స్థానిక సంతమార్కెట్‌లో వేంచేసిన లక్ష్మీగణపతి ఆలయం వద్ద శనివారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు, సీనియర్ రాజకీయ నేత ముద్రగడ పద్మనాభం, యువ నాయకుడు గిరిబాబు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

మొక్కుబడిగా కౌన్సిల్ సమావేశం



సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెబుతున్న కమిషనర్ సత్యనారాయణ

ఏలేశ్వరం: స్థానిక నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం శనివారం మొక్కుబడిగా జరిగింది. పాలకవర్గం సొంత పనుల నిమిత్తం అత్యవసర సమావేశం ఏర్పాటు చేసే పరిస్థితికి కౌన్సిల్ దిగజారిందనే విమర్శలు వస్తున్నాయి. నిబంధనల ప్రకారం ప్రతినెలా కౌన్సిల్ సమావేశం నిర్వహించాలి. అయితే నెలాఖరు వరకూ ఆగి చివర్లో సమావేశం పెడుతున్నారు. దీనిపై సభ్యులు విమర్శలు చేస్తున్నారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన శనివారం కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత అజెండా చదివి వినిపించారు. సభ్యులు పట్టణంలో వీధి దీపాలపై ప్రశ్నించారు. దీనిపై కమిషనర్ సత్యనారాయణ మాట్లాడుతూ త్వరలోనే సమస్యను పరిష్కారిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

99 శాతం ఇంటింటా సర్వే పూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న సహాయ ఓటరు నమోదు అధికారి సూర్యప్రభ

ప్రత్తిపాడు: నియోజకవర్గంలో చేపట్టిన ఇంటింటా ఓటరు సర్వే 99 శాతం పూర్తయ్యిందని సహాయ ఓటరు నమోదు అధికారి, తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం స్పెషల్ సమ్మరీ రివిజన్ – 2025లో భాగంగా రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న ఇంటింటి సర్వే ప్రగతిపై చర్చించారు. 2025 జనవరి 6వ తేదీన తుది ఓటరు జాబితా ప్రచురిస్తామని తహసీల్దార్ ఎం.సూర్యప్రభ తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ (ఎన్నికలు) టి.శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చేయూత మార్ట్ పరిశీలన

కిర్లంపూడి: వాణిజ్య రంగంలో మహిళలు రాణిస్తున్నారని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన (ఐఏఎస్) అన్నారు. కిర్లంపూడిలోని చేయూత మహిళా మార్ట్‌ను శనివారం ఆమె సందర్శించారు. మార్ట్ వ్యాపార లావాదేవీల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వాల తోడ్పాటుతో మహిళలు వ్యాపార రంగంలో రాణిస్తున్నారని తెలిపారు. ఆమె వెంట డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డెరెక్టర్ కె.శ్రీరమణి, మార్ట్ సిబ్బంది ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

తొండంగి: ప్రజా సమస్యల పరిష్కారానికి సమన్వయంతో అధికారులు కృషిచేయాలని తహసీల్దార్ మురార్జీ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైస్ ఎంపీపీ–2 యాదాల రమణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. విద్యుత్, వైద్యం, విద్య, హౌసింగ్ తదితర శాఖలకు సంబంధించి చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.

ధర్మవరంలో మన ఇల్లు- మన గౌరవం

ప్రత్తిపాడు రూరల్: పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జిల్లా బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని ధర్మవరంలో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబు ఆధ్వర్యంలో శనివారం మన ఇల్లు మన గౌరవం కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల సర్పంచులు బెంతుకుర్తి సుశీల, తుమ్మల భవాని, ఎంఈఓ వి.రాజబాబు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులు



ఏలేశ్వరంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు



గోకవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



జగ్గంపేటలో పూజలు చేస్తున్న వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం, జెడ్పీటీసీ బిందు మాధవి

బాబుకు సద్బుద్ధి ప్రసాదించు స్వామీ..

- తిరుపతి లడ్డూను అపవిత్రం చేసిన కూటమి ప్రభుత్వం
- పాప ప్రక్షాళన కోరుతూ ఆలయాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణుల పూజలు
- కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీయడంపై మండిపాటు



పాతకొట్టాం వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దాడిశెట్టి రాజా, యనమల కృష్ణుడు



తాళ్లూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేసిన తోట నరసింహం, పార్టీ శ్రేణులు

కోటనందూరు: కలియగదైవం తిరుపతి వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రతిష్టను కాపాడడంలో సీఎం చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని మాజీ మంత్రి దాడిశెట్టి రాజా స్వామివారిని కోరారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు కోటనందూరు మండలం పాతకొట్టాం ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో వైఎస్సార్ సీపీ నేత యనమల కృష్ణుడుతో కలిసి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. తొలుత వారికి వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా దాడిశెట్టి రాజా మాట్లాడుతూ ప్రపంచ ప్రజల ఆరాధ్యదైవం తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రతిష్టను, లడ్డూ ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపహాస్యం చేశారన్నారు. 100 రోజుల పాలనపై ప్రజల దృష్టి మరల్చేందుకే లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా మాజీ సీఎం జగన్‌ను డిక్లరేషన్ ఇచ్చి దేవదేవుని దర్శనానికి వెళ్లమనడం చంద్రబాబు నీచరాజకీయాలకు నిదర్శనమన్నారు. చంద్రబాబు కారణంగా కలియుగదైవం వేంకటేశ్వరస్వామికి కలిగిన అపచారం, పాపాలు తొలగిపోవాలని కోరుతూ పూజలు చేసినట్లు చెప్పారు. యనమల కృష్ణుడు మాట్లాడుతూ జగన్‌కు ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూసి ఓర్వ లేకే చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. లడ్డూ తయారీలో కల్తీ జరిగితే నిష్పక్షపాతంగా విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి గాని, లడ్డూ పవిత్రను రాజకీయంగా వాడుకోవడమేంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు, లోవదేవస్థానం మాజీ చైర్మన్ బొంగు ఉమారావు, సర్పంచ్ పసగుడుగుల వరహాలు, ఉపసర్పంచ్ బొంగు గోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు గొర్లి రామచంద్రరావు, చింతకాయల చినబాబు, వెలగా వెంకటకృష్ణాజీ, నల్లమిల్లి గోవిందు, బొత్స సత్తిబాబు, కుంచె అచ్చిరాజు, గర్సింగు దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

గండేపల్లి: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై కూటమి ప్రభుత్వం చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. స్వామివారి లడ్డూను అపవిత్రం చేసిన చంద్రబాబుకు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ మండలంలోని తాళ్లూరు జీయ్యన్న మఠంలో శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధారాలు లేని అసత్య ప్రచారాలు చేస్తూ సాక్షాత్తూ కలియుగ దైవమైన వేంకటేశ్వరస్వామిపై అబాండాలు వేస్తున్నారన్నారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు పూర్తయినా రాష్ట్ర ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, దానిని డైవర్ట్ చేసేందుకు చంద్రబాబు ఇటువంటి అసత్య ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ నేతలు ఒబిణ్ని సత్యనారాయణ, వీరబాబు, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, బేకరి బాబు, తదితరులు పాల్గొన్నారు. గండేపల్లిలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడులో...

ప్రత్తిపాడు: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబునాయుడి పాపాన్ని ప్రక్షాళన చేయాలని కోరుతూ ప్రత్తిపాడు వేంకటేశ్వరస్వామి ఆలయంలో శని



తేటగుంటలో పూజలు చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

వారం వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు ఆదేశాల మేరకు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బెహరా దొరబాబు ఆధ్వర్యంలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి తదితరులు స్వామివారికి కొబ్బరి కాయలు కొట్టి, చంద్రబాబుకు సద్బుద్ధిని ప్రసాదించాలని పూజలు నిర్వహించారు. అనంతరం చంద్రబాబు అసత్య ప్రసారాలకు నిరసనగా ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు, పార్టీ నాయకులు పినిశెట్టి ప్రకాష్, ధర్మాల సరోజాదేవి, మేడిబోయిన చంద్రశేఖర్, మదినే నాగార్జున, నల్లమిల్లి నానాజీ, పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరంలో...

ఏలేశ్వరం: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబుకు సద్బుద్ధి ప్రసాదించాలని కోరుతూ నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు పార్టీ శ్రేణులు ఆలయాల్లో పూజలు చేశారు. పట్టణంలోని బాలాజీచౌక్ వద్ద పార్టీ నాయకులు విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని తన రాజకీయం కోసం వాడుకుంటున్న చంద్రబాబుకు భగవంతుడు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి వాడకంపై వేర్వేరు ప్రకటనలు చేయడం చూస్తే వారి నైజం బయట పడుతుందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వ వంద రోజుల పాలనపై జనం దృష్టిని మరల్చేందుకు లడ్డూ వివాదానికి తెరలేపారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, శిడగం వెంకటేశ్వరరావు, వాగు బలరామ్, జువ్విన వీర్రాజు, మలకల వేణు, అలమండ నాగేంద్ర పాల్గొన్నారు.

తుని రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికు మంచి బుద్ధిని ప్రసాదించాలని కోరుతూ మండలంలోని తేటగుంటలో వైఎస్సార్స్ సీపీ నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆత్మ మాజీ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు ఆధ్వర్యంలో నాయకులు ఉమామహేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ అత్తి నాగరాజు, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, అన్నవరం దేవస్థానం మాజీ ధర్మకర్త పేరూరి బద్రినారాయణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు గుండుబిల్లి వెంకటరమణ, గొల్లపల్లి నూకరాజు, నాయకులు గణేషుల వీరబాబు, బుజ్జిబాబు రాజు పాల్గొన్నారు.

జగ్గంపేట: వేంకటేశ్వరస్వామి ప్రతిష్టకు భంగం కలిగించి హిందువుల మనోభావాలను దెబ్బతీసిన చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఒమ్మి రఘురాం కోరారు. ఈ మేరకు జగ్గంపేటలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం జెడ్పీటీసీ ఒమ్మి బిందుమాధవితో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

గోకవరం: తిరుపతి లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసిన సీఎం చంద్రబాబు పాపానికి ప్రక్షాళన చేయాలని కోరుతూ మండలంలోని వేంకటేశ్వర స్వామి ఆలయాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ శ్రేణులు విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, దాసరి చిన్నబాబు, కర్రి సూరారెడ్డి, సుంకర వెంకటరమణ, ఉంగరాల ఆదివిష్ణు తదితరులు పాల్గొన్నారు. పెంటపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో పార్టీ మండలాధ్యక్షుడు పాటి రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

అన్నవరంలో విశేష పూజలు

అన్నవరం: తిరుపతి వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం అన్నవరంలోని సత్యదేవుని తొలిపాంచా వద్ద స్వామివారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు కుమారుడు వరుపుల సూరిబాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు వంద రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. చంద్రబాబు నీచ రాజకీయాల నుంచి ప్రజలను కాపాడాలని స్వామివారిని కోరారు. తొలుత స్థానిక నేరేళ్లమ్మ తల్లి ఆలయం నుంచి ఊరేగింపుగా నాయకులు సత్యదేవుని తొలిపాంచా వద్దకు చేరుకుని కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. కార్యక్రమంలో రౌతులపూడి, ప్రత్తిపాడు జెడ్పీటీసీలు గొల్లు దివాణం, బెహరా రాజరాజేశ్వరి, ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల సుధాకర్, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు వాసిరెడ్డి జమీలు, శంఖవరం మండల కన్వీనర్ నరాల శ్రీనివాస్, ఎంపీటీసీలు దడాల సతీష్, రాయి ప్రసాద్, సప్ప రాంబాబు, అమరాది కాశీ, సత్యప్రసాద్, పార్టీ నాయకులు వాసిరెడ్డి భాస్కరబాబు, కొండపల్లి అప్పారావు పాల్గొన్నారు.



అన్నవరంలో సత్యదేవుని తొలిపాంచా వద్ద పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ


ప్రత్తిపాడు: ప్రకృతి సాగు ద్వారా రైతులు అధిక లాభాలను అర్జించవచ్చని జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ జె. ఇలియాజర్ అన్నారు. ప్రత్తిపాడు మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ మండలంగా ఎంపికైన ప్రత్తిపాడు మండలంలోని ప్రతి యూనిట్ పరిధిలో బయో ఇన్పుట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రకృతి వ్యవసాయంలో కీలక భూమిక పోషిస్తున్న సార్వత్రిక సూత్రాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. జగ్గంపేట ఇన్‌చార్జి ఏడీఏ యింటి వీర గంగాధర్ మాట్లాడుతూ రైతులకు ప్రకృతి సాగుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రకృతి వ్యవసాయానికి కావలసిన ఆర్థిక వనరులను మహిళా రైతులకు సంఘం ద్వారా అందిస్తామని ఏపీఎం వై.వెంకట్ హామీ ఇచ్చారు. జిల్లా కోఆర్డినేటర్ వైఎం గణేష్, టీం లీడర్ నికేష్ వర్మ, ట్రైనర్స్ మూరా చినబాబు, ఎం.రామరాజు తదితరులు పాల్గొన్నారు.



శిక్షణలో ప్రసంగిస్తున్న జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ ఇలియాజర్

ఘనంగా భగత్‌సింగ్ జయంతి వేడుకలు

ఏలేశ్వరం: విప్లవవీరుడు భగత్‌సింగ్, అభ్యుదయ కవి గుర్రం జాషువా జయంతి వేడుకలను పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డి.సునీత ఆధ్వర్యంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్ సింగ్ జీవితం యువతకు ఆదర్శమన్నారు. భగత్ సింగ్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. గుర్రం జాషువా అభ్యుదయ భావాలు కలిగిన కవిగా ప్రత్యేక గుర్తింపు పొందారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ ప్రగడ ప్రయాగమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఏలేశ్వరంలో భగత్‌సింగ్, గుర్రం జాషువా చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఉచిత పశువైద్య శిబిరం

తొండంగి: మండలంలోని వాకదారిపేటలో శనివారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పశువైద్యులు తీర గ్రామాల్లో పాడి గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులు రాకుండా రూ.1.5 లక్షలు విలువైన పోషకాహార మందులను పాడి రైతులకు అందజేశారు. కార్యక్రమంలో దివీస్ మేనేజర్ సుధాకర్, ప్రతినిధులు బి.వాసుబాబు, ఎన్.బాలకృష్ణ పాల్గొన్నారు.



వాకదారిపేటలో పాడిరైతులకు పోషకాహార కిట్లు అందజేస్తున్న దివీస్ ప్రతినిధులు

జగ్గంపేట సీఐగా శ్రీనివాస్



జగ్గంపేట: జగ్గంపేట సీఐగా వైఆర్‌కే శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు శనివారం ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఆయన గతంలో జగ్గంపేట, గండేపల్లి పోలీస్ స్టేషన్లలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఆయన త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారు.

పాఠశాలలో డీఈఓ తనిఖీలు

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో మిడ్డే మీల్స్ పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ ఆదేశించారు. మండలంలోని లింగంపర్తిలో జెడ్పీ ఉన్నత పాఠశాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులకు వెళ్లి విద్యార్థులకు ప్రశ్నలను అడిగి వారి అభ్యసనా సామర్థ్యాలు తెలుసుకున్నారు. విద్యార్థుల నోట్‌బుక్స్‌ను పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులందరూ మిడ్డే మీల్స్ తినేలా చూడాలన్నారు. టెన్త్‌లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



లింగంపర్తి హైస్కూల్‌లో మిడ్డేమీల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన

గండేపల్లి: అత్యవసర సమయంలో మనిషి చేసే కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్)పై కాకినాడ ట్రినిటీ హాస్పటల్ వైద్యులు ఎం.మురళీకృష్ణ విద్యార్థులకు అవగాహన కల్పించారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవడం, గుండె జబ్బుల నివారణ, గుండె సంబంధిత పౌష్టికాహారం, వ్యాయామం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.రవిశంకర్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రశాంతి, ఎం.శేషసాయి దుర్గ, బీఎస్‌బీ వైదేహి, ఎల్.ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ సవరణ క్యాంప్

ఆదిత్య యూనివర్సిటీలో శనివారం ఆధార్ సవరణ క్యాంప్ నిర్వహించినట్టు డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది ఆధార్ నమోదు, ఆధార్‌లో పేరు, ఫోన్ నంబర్, డేట్ ఆఫ్ బర్త్ తదితర సవరణలను చేయించుకున్నట్టు చెప్పారు.

రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు ‘సిరి’ ఎంపిక

తుని రూరల్: మండలంలోని వి.కొత్తూరు శివారు కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఇంటర్మీడియెట్ మొదట సంవత్సరం విద్యార్థిని బసనబోయిన సిరి రాష్ట్రస్థాయి అండర్–19 రగ్బీ పోటీలకు ఎంపికైనట్టు కేజీబీవీ ప్రిన్సిపాల్ అమృతవాణి శనివారం తెలిపారు. వచ్చే నెల రెండు, మూడు తేదీల్లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో సిరి పాల్గొంటుందని చెప్పారు. ఎంపిక పత్రాన్ని జిల్లా గేమ్స్ ఫెడరేషన్ సభ్యుడు నాగలింగేశ్వరరావు సిరికి అందజేసినట్టు వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన సిరిని జిల్లా బాలికా సంరక్షణ అధికారి ఉమామహేశ్వరి, ప్రిన్సిపాల్ అమృతవాణి, పీడీ అర్చన అభినందించారు.



సిరికి ఎంపిక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ఉదయం ఉక్కబోత.. సాయంత్రం వర్షం మోత

గండేపల్లి: ఈ ఏడాది వాతావరణంలో అంతుచిక్కని మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నాటి నుంచి వాతావరణం రోజుకోలాగ ఉంటోంది. ఆగస్టు, ఈ నెలలో సైతం వెసవిని తలపించేలా ఎండలు కాస్తున్నాయి. జూన్ నెలను మరపించేలా వర్షాలు పడుతున్నాయి. మండలంలో శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఉక్కపోతతో తీవ్రమైన ఎండ కాసింది. సాయంత్ర ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు సేదతీరారు. వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వీధుల్లో వర్షపు నీరు ఏరులై నీరు పారింది.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తం




శంఖవరంలో రాట ముహూర్తం చేస్తున్న ఆటో యూనియన్ సభ్యులు, మహిళలు

శంఖవరం: స్థానిక శివాలయం సెంటర్‌లో శివ సత్య సాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు శనివారం రాట ముహూర్తం చేశారు. ఉదయం 9 గంటలకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు వేసి పందిరి రాట వేశారు. పలువురు భక్తులు, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

ఉచిత వినికిడి వైద్య శిబిరం

తుని: స్థానిక ఎస్‌పి రోడ్డులోని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ హోంలో శనివారం ఉచిత వినికిడి వైద్య శిబిరం నిర్వహించారు. మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్స్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో కాకినాడ హియర్‌జాప్ ఆసుపత్రి వైద్యులు 50 మందికి ఉచితంగా వినికిడి పరీక్షలు చేశారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు.

సామూహిక సీమంతాలు



ప్రత్తిపాడుతో సామూహిక సీమంతాలు చేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, అధికారులు

ప్రత్తిపాడు: మాతాశిశు రక్షణలో అంగన్‌వాడీ వర్కర్ల పాత్రే కీలకమని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. స్థానిక లయన్స్‌క్లబ్ కల్యాణ మండపం ఆవరణలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంపూర్ణ పోషణ మాసోత్సవాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలకు చెందిన గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేశారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, జనసేన, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జులు వరుపుల తమ్మయ్యబాబు, ఎస్. సత్తిరాజు, మాజీ జెడ్పీటీసీ జ్యోతుల పెదబాబు పాల్గొన్నారు.